# వల్లభ్‌భాయ్ పటేల్

జీవిత కథ

రాజ్‌మోహన్ గాంధీ

తెలుగు సేత

టంకశాల అశోక్

ఎమెస్కో

# విషయసూచిక


**ఉపోద్ఘాతం** *xiii*

ఒకటి
1875–1918
**తొలినాళ్లు** 1

రెండు
1918–22
**అనుచరుడు** 69

మూడు
1922–29
**సర్దార్** 147

నాలుగు
1929–34
**ఖైదీ** 239

ఐదు
1934–39
**బాస్** 333

ఆరు
1939–45
**అడ్డుకోలు** 395

ఏడు
1945–47
**విజయం** 471

ఎనిమిది
1947–48
**పరాకాష్ఠ** 587

తొమ్మిది
1948 –50
**సైనికుడు** 675

**వివరణలు** 743

SOURCES AND BIBLIOGRAPHY 816

అహమదాబాద్‌కు దక్షిణాన 75 మైళ్ల దూరంలో ఉన్న బరోడాకు వెళ్తుంటే సరిగా మధ్యలో నడియాడ్ అనే పట్టణం వస్తుంది. అది నాలుగు రోడ్ల కూడలి. ఒక దారి ఉత్తరాన అహమదాబాద్‌కు, ఒకటి దక్షిణాన భరూచ్, సూరత్ రేవులకు వెళతాయి. మూడవది పశ్చిమాన అరేబియా సముద్రతీరంలో గల కాంబే రేవుకు పోతుంది. ఆ రేవు మొఘల్ పాలనలో ఒక వెలుగు వెలిగింది. ఇక నాల్గవ దారి తూర్పు ప్రాంతాలకు వెళ్తుంది. అది ఒక ప్రధానమైన వాణిజ్యమార్గం. ఇది గాక ఆ చుట్టు పక్కల ప్రాంతాలకంతా నడియాడ్ వ్యాపార కేంద్రంగా వర్ధిల్లింది. ఆ తరువాత బ్రిటిష్ పాలనలో బాంబే–అహమదాబాద్ రైలు మార్గం 1864లో మొదలైనప్పుడు అక్కడొక రైలు స్టేషన్ ఏర్పాటైంది.

సుమారు 25,000 మంది జనాభాతో, అన్నీ వంకర టింకర వీథులుండిన అటువంటి పట్టణంలో వల్లభ్‌భాయ్ పటేల్ జన్మించాడు. కాని ఎప్పుడో మనకు తెలియదు. అయితే 1897లో ఇంటర్ పరీక్షలు రాయాల్సి వచ్చినప్పుడు, 31–10–75 అంటూ తనకు తోచిన తేదీ ఒకటి వేసాడు. దానిపై ఆయన తరువాత కాలంలో వివరిస్తూ, “నాకు ఎంత వయసన్నప్పుడు ఏదో ఒకటి చెప్పాల్సి వచ్చింది. కాని ప్రమాణం చేసి చెప్పవలసి వస్తే మాత్రం ‘సుమారుగా’ అంటాను”, అని చెప్పాడు.[1]

వల్లభ్ అన్నలలో ఒకడైన నర్సీభాయ్ తమ కుటుంబపు వివరాలు కొన్ని రాసి ఉంచాడు. తన లెక్కలను బట్టి వల్లభ్ జన్మదినం వైశాఖ శుద్ధ రవివారం 1932 సంవత్ అన్నమాట. అనగా, ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం 30–04–1876 లేదా 07–05–1876 అవుతుంది.[2]

అయినప్పటికీ, “నారాయణ్‌భాయ్ తరువాత ఒక నెలకు” వల్లభ్ జన్మించాడన్నది అస్పష్టమైన మాటే గనుక, వల్లభ్ పుట్టిన రోజు కచ్చితంగా ఏదో చెప్పే అవకాశంలేదు. దానినట్లుంచితే, సర్దార్ వల్లభ్‌భాయ్ సంతానంతో పాటు దేశమంతా ఆయన జన్మదినం

అక్టోబర్ 31, 1875 అనే భావిస్తున్నందున, అది నిజంకాకపోవచ్చునని తెలిసినప్పటికీ, మనం కూడా అదే తేదీని తీసుకుందాం.

వల్లభ్ తల్లి లాడ్‌బా ఆయనను తన సోదరుడు డూంగర్ భాయ్ దేశాయ్ ఇంట్లో కన్నది. డూంగర్ భాయ్ నడియాడ్ మున్సిపాలిటీలో భవనాల ఓవర్సీర్‌గా పనిచేసేవాడు. లాడ్‌బాకు అప్పటికే ముగ్గురు సంతానం. అందరూ కుమారులే. వాళ్ల సంప్రదాయం ప్రకారం ఆమె తన ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. తన భర్త ఝువేర్ భాయ్‌ది కరమ్‌సాడ్ గ్రామం. అది నడియాడ్ నుంచి 12 మైళ్ల దూరంలో ఉంది. ఆనంద్‌కు మూడు మైళ్లు.

ఝువేర్ భాయ్, లాడ్‌బా, ఇంకా వాళ్ల బంధువులంతా పాటీదార్లు. కొన్ని శతాబ్దాల క్రితం వాళ్ల పూర్వీకులు ఉత్తర ప్రాంతాల నుంచి తరలి వచ్చి చరోతర్ అనే చోట స్థిరపడ్డారు. అది ఇసుకభూమే అయినా సారవంతమైంది. చరోతర్‌కు తూర్పున, దక్షిణాన మాహీనది, ఉత్తరాన శేఢీ నది ప్రవహిస్తుండగా పశ్చిమాన భల్ ప్రాంతపు నల్లరేగడి భూములున్నాయి. అహమదాబాద్, బరోడా మధ్యగల భూములలో చాలావరకు చరోతర్ కిందకు వస్తాయి. కాని ఆ రెండు నగరాలు ఇందులోకి రావు. క్రీస్తుశకం ఆరవ శతాబ్దంలో వాయవ్య దిశనుంచి భారతదేశంలోకి వచ్చిన హూణులో, లేక పంజాబ్‌కు చెందిన గుజ్జర్‌లో, లేక ఇద్దరూనో పాటీదార్ల పూర్వీకులై ఉండాలి. మొత్తానికి వారు చరోతర్ ప్రాంతంలోని అడవులను నరికి, అక్కడి ఇసుక నేలను పశువుల ఎరువుతో, నల్లమట్టితో సారవంతంచేసి వ్యవసాయం సాగించారు. సమీపంలోని మోతుబరులకు, సామంతులకు సైనికులుగా పనిచేసారు. వారి పట్ల విధేయత చూపి ఓర్పుతో వ్యవహరిస్తూ హిందూ, ముస్లిం, యూరోపియన్ పాలకులందరి నుంచి మన్ననలు, గౌరవాన్ని పొందారు.

ఈ క్రమంలో వారికి తమ భూములపై హక్కులు లభించాయి. భూమి పట్టాలు గలవారిగా వారిని పాటీదార్లు అని పిలిచారు. వారే తర్వాత పటేళ్లు అయారు. 15వ శతాబ్దం చివరిలో వారి నుంచి సహాయం పొందిన ముస్లిం రాజు ఒకరు వారికి మరిన్ని భూములు ఇచ్చాడు. మొఘల్ పాలన అంతం కానున్న రోజులలో బరోడాకు చెందిన ముస్లిం సామంతరాజును ఓడించి అధికారానికి రావటంలో వారు హిందూ రాజు ఒకరికి తోడ్పడ్డారు. కాలక్రమంలో తమ జనాభా పెరగటంతో కొత్త అవకాశాల కోసం వెతుకుతూ వారు దక్షిణాఫ్రికా, ఫిజీ, న్యూజీలాండ్, బ్రిటన్, ఉత్తర అమెరికాలకు విస్తరించారు. ఈ రోజున అనేక విదేశాల టెలిఫోన్ డైరెక్టరీలలో పటేళ్ల పేర్లు ఒక

పూర్తి కాలమో, అందుకు మించో ఉంటాయి. నిజానికి వల్లభ్‌భాయ్ జన్మించే నాటికే కరమ్‌సాడ్‌కు, ఇతర చరోతర్ ప్రాంతాలకు చెందిన పటేళ్లు కొందరు బయటి దేశాలకు వెళ్లి స్థిరపడ్డారు.

ఆచార వ్యవహారాలకు సంబంధించి పాటీదార్లలో కొన్ని విచిత్రాలు కన్పిస్తాయి. వారిలో మాంసాహారులున్నారు. దానిని విసర్జించినవారున్నారు. వరకట్నం, కన్యాశుల్కం రెండూ కన్పిస్తాయి. విధవా వివాహం ఉంది, దానిని నిషేధించటమూ ఉంది. వల్లభ్‌భాయ్ పుట్టే నాటికి అమలులో ఉన్నవి మాంసాహార విసర్జన, వరకట్న స్వీకారం, విధవా వివాహ నిషేధం.

అయితే, ఒకతరం నుంచి మరొక తరానికి ఈ విధంగా ఆచార వ్యవహారాలను మార్చుకొన్నప్పటికీ వారిలో కొన్ని సూత్రాలు మాత్రం నిలిచిపోయాయి. అవి, హిందూ మతం పట్ల కట్టుబాటు, బయటి వారికి వ్యతిరేకంగా అందరూ ఒకటి కావటం, పురుషాధిపత్యం, పెద్దల సమక్షంలో మౌనం పాటించటం, ఉమ్మడి కుటుంబంపట్ల విధేయత, బయటి వ్యవహారాలలో స్వతంత్ర వ్యవహరణ. దీనితోపాటు నిర్మొహమాటంగా మాట్లాడటం, వేషభూషణాల విషయమై పట్టింపు లేకపోవటం, పాటీదార్ల ఉమ్మడి సమాజం అన్నట్లుగా ఉండే గ్రామంలో అందరూ సమానత్వ భావంతో మెలగటం, పాటీదార్లు కాని వారిపట్ల ఆధిక్యతా భావన, శక్తిమంతులది ఇతరులకన్న పైచేయి కావటం సహజమనే ధోరణితో తమను తాము అధికులుగా ఊహించుకోవటం – ఇవన్నీ పాటీదార్ల లక్షణాలు.[3] బిషప్ రెజినాల్డ్ హెబర్ అనే బ్రిటిష్ యాత్రికుడు వారి గురించి చేసిన వర్ణనను గమనించండి:

> హిందూస్థాన్‌కు చెందిన జమీందార్లతో పోల్చితే వస్త్రధారణలో, వ్యవహరణలో, పద్ధతులలో, సాధారణరూపంలో వారు చాలా తక్కువ స్థాయిలో కనిపిస్తారు. వారి పద్ధతులు అంత నాగరికంగా లేకపోయినా చాలా స్వతంత్రులు. పైవారి ఎదుట చేతులు ముడిచి నిలవటంగాక వారు వెంటనే కూర్చుంటారు...[4]

ఈ విధమైన లక్షణాలు, సంప్రదాయాలు గల ఝవేర్‌భాయ్, లాడ్‌బా పూర్వీకులు వ్యవసాయం బాగా చేసేవారు. కాని దురాశాపరులు కారు. అడవులు నరికేటప్పుడు మర్రి, మామిడి, రావి, వేప, ఇప్ప చెట్లను అట్లాగే వదిలివేసేవారు. రైతులు మధ్యాహ్నం సేదతీరేందుకు, వంట చెరకుగా, వేసవిలో పళ్లకు అవి ఉపయోగపడ తాయన్నది వారి ఆలోచన.[5] వల్లభ్‌భాయ్ జననానికి కొద్ది అటుఇటుగా అలెగ్జాండర్ ఫోర్బ్స్ అనే